క్లుప్తంగా

ఆర్ఐపీఈగా శ్రీనివాస్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): రీజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌గా బి.శ్రీనివాస్ సోమవారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. పశ్చిమ గోదావరి జిల్లా డైట్ కళాశాలలో అధ్యాపకునిగా పని చేస్తున్న ఆయన పాఠశాల విద్యా శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ నాగమణి చేతుల మీదుగా నియామక ఉత్తర్వులు అందుకున్నారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా విద్యా శాఖ అధికారి పి.రమేష్‌ను మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. శ్రీనివాస్ ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాలకు వ్యాయామ పర్యవేక్షక అధికారిగా వ్యవహరిస్తారు. పీఆర్ బాలికోన్నత పాఠశాలలోని ఆర్ఐపీఈ కార్యాలయంలో ఆయనను రాష్ట్ర పీఈటీ సంఘం మాజీ అధ్యక్షుడు ఎల్.జార్జి, ఎస్‌జీఎఫ్ఐ సంయుక్త కార్యదర్శి సునీల్, జిల్లా వ్యాయామోపాధ్యాయ సంఘం మాజీ అధ్యక్షుడు రవిరాజు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

చెట్లతోనే మానవ మనుగడ


మొక్కలు నాటుతున్న కాకినాడ స్టార్స్ సభ్యులు

కాకినాడ రూరల్: లయన్స్ క్లబ్ కాకినాడ స్టార్స్ ఆధ్వర్యంలో స్థానిక సర్పవరం జంక్షన్ వద్ద బోట్‌క్లబ్ ఉద్యానవనంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు, రిటైర్డ్ ఎఫ్ఐసీ జీఎం ఐ.ప్రసాద్ నాయుడు మాట్లాడుతూ, చెట్లతోనే మానవ మనుగడ సాధ్యమవుతుందన్నారు. ప్రాణ వాయువును నిరంతరం అందిస్తున్న చెట్లు జీవకోటికి మేలు చేస్తున్నాయన్నారు. లయన్స్ క్లబ్ కాకినాడ స్టార్స్ ఆధ్వర్యంలో తమ కార్యవర్గం సమాజ సేవా కార్యక్రమాల్లో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని తొలిసారిగా చేపట్టిందన్నారు.

పోస్టల్ బీమా ఏజెంట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

బాలాజీచెరువు: తపాలా జీవిత బీమా డైరెక్ట్ ఏజెంట్లుగా పనిచేయడానికి అర్హత ఉన్న యువతీ యువకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కాకినాడ పోస్టల్ సూపరింటెండెంట్ ఆర్.నవీన్‌కుమార్ సోమవారం తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై, 18 ఏళ్లు పైబడిన వారు అర్హులని చెప్పారు. దరఖాస్తులను ఈ నెల 15వ తేదీలోగా కాకినాడ పోస్టల్ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

ఐఐఎఫ్‌టీ ఎంబీఏ బ్యాచ్ ప్రారంభం


ఐఐఎఫ్‌టీ ఎంబీఏ నూతన బ్యాచ్ విద్యార్థులు

బాలాజీచెరువు: ఐఐఎఫ్‌టీ ఎంబీఏ విద్యార్థుల 2025–27 నూతన బ్యాచ్‌ను సోమవారం జేఎన్‌టీయూకే ప్రాంగణంలో ఉన్న ఐఐఎఫ్‌టీ క్యాంపస్‌లో ప్రారంభించారు. క్యాంపస్ విభాగాధిపతి డాక్టర్ వి.రవీంద్రసారిధి విద్యార్థులకు స్వాగతం పలకగా, ప్రొఫెసర్ మికలేష్ ప్రసాద్ యాదవ్, డాక్టర్ సౌరవ్‌దాష్, జేకే వర్మ, డాక్టర్ ఓలీమిశ్రా విద్యార్థులకు కోర్సుపై దిశానిర్దేశం చేశారు. ప్రపంచ వాణిజ్యం, అంతర్జాతీయ వ్యాపార భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న వారిని తయారు చేయడానికి రూపొందించబడిన మంచి కోర్సు అని, వాణిజ్య, లాజిస్టిక్స్, ఫైనాన్స్ మార్కెటింగ్‌లో కూడిన సూత్రాలను మిళితం చేయబడిందని ప్రొఫెసర్లు విశదీకరించారు. విద్యార్థులకు నాలుగు రోజుల పాటు వృత్తిపరమైన వాతావరణంలో పరిచయం చేయడానికి ఒరియంటేషన్ నిర్వహిస్తామని విభాగాదిపతి రవీంద్రసారధి తెలిపారు.

డొక్కా సీతమ్మ విగ్రహావిష్కరణ

కాకినాడ రూరల్: రమణయ్యపేటలోని ఏపీఎస్పీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్‌లో తెలుగు ఉపాధ్యాయుని రామలక్ష్మి సమకూర్చిన దాత డొక్కా సీతమ్మ విగ్రహాన్ని సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే పంతం నానాజీ, హెచ్ఎం గాయత్రి, ఎంఈఓలు వేణుగోపాలరావు, పత్తి సత్యనారాయణ, ఏపీఎస్పీ అడిషనల్ కమాండెంట్ దేవానందరావు, పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ దుర్గాదేవి, సత్యవోలు శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం పాఠశాలలో ల్యాబ్ ప్రారంభించారు. విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు.

మత్తు పదార్థాలు అమ్మితే చర్యలు


ఎస్సై గణేష్‌కుమార్

కాకినాడ రూరల్: తిమ్మాపురం పోలీసు స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యా సంస్థలకు 100 మీటర్ల దూరంలో ఉన్న పాన్ షాపులు, బడ్డీ దుకాణాలు, ఫ్యాన్సీ షాపుల్లో గుట్కా, ఖైనీ వంటి మత్తు కలిగించే, ఆరోగ్యానికి హానికరమైన ఉత్పత్తులు అమ్మినా, ప్రదర్శించిన కఠిన చర్యలు తప్పవని ఎస్సై వై.గణేష్‌కుమార్ హెచ్చరించారు. విద్యార్థుల ఆరోగ్యం, వారి భవిషత్తు దృష్ట్యా తాము తీసుకునే చర్యలకు షాపుల యజమానులు సహకరించాలని సోమవారం రాత్రి ఆయన కోరారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి, వాటి అమ్మకాలు జరిపితే కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

మహానేత చలువతో.. సాగుకు జీవం

- గౌర్రిపూడి ఎత్తిపోతల పథకంతో 4,800 ఎకరాలకు సాగునీరు
- వైఎస్సార్ సేవలను మరువలేమంటున్న అన్నదాతలు
- నేడు దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి


ఎత్తిపోతల పథకానికి నిర్మించిన పంపు హౌస్. నీరు చేరేందుకు నిర్మించిన బావి


ఎత్తిపోతల పథకం శంకుస్థాపన శిలాఫలకం

కరప: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చలువే కరప మండలంలోని గౌర్రిపూడి ఎత్తిపోతల పథకం(లిఫ్ట్ ఇరిగేషన్). రూ.12.54 కోట్లతో నిర్మించిన ఈ లిఫ్ట్ ఇరిగేషన్ తమకు ఇచ్చిన వరంగా అన్నదాతలు మననం చేసుకుంటున్నారు. ఈ పథకం వల్ల కరప, తాళ్లరేవు మండలాల్లోని శివారు ప్రాంత, మెరక భూములకు సాగు నీరు లభిస్తోంది. సుమారు 4,800 ఎకరాల్లో పంటలు పండించుకోవడానికి అవకాశం ఏర్పడింది. కరప మండలంలో గౌర్రిపూడి, గురజనాపల్లి, పాతర్లగడ్డ, తాళ్లరేవు మండలంలో వేమగిరి, చొల్లంగి, చొల్లంగిపేట గ్రామాల్లోని పొలాలకు గతంలో సాగు నీరందక పంటలు పండించడానికి రైతులు ఎన్నో ఇబ్బందులు పడేవారు. దీనికితోడు మెరక భూములు కావడంతో సాగుకు రైతులు అష్టకష్టాలు పడాల్సి వచ్చేది. అప్పటి తాళ్లరేవు ఎమ్మెల్యే దొమ్మేటి వెంకటేశ్వర్లు ముఖ్యమంత్రి వైఎస్సార్‌ను కలిసి.. రెండు మండలాల్లోని శివారు భూముల గురించి, సముద్రంలోకి వృథాగా పోతున్న తుల్యభాగ డ్రెయిన్‌లోని నీటిని గురించి వివరించారు. వెంటనే వైఎస్సార్ స్పందించి రూ.12.54 కోట్ల నిధులు మంజూరు చేశారు. దీంతో 2009 ఫిబ్రవరి 19వ తేదీన అప్పటి ఎమ్మెల్యే దొమ్మేటి ఈ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేశారు. ఈ పథకానికి శ్రీరాజశేఖర పరస్పర సహకార ఎత్తిపోతల పథకంగా నామకరణం చేశారు. గురజనాపల్లి గ్రామానికి చెందిన అప్పటి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పబ్బినీడి పాపారావు(ప్రస్తుతం వైఎస్సార్ సీపీ నాయకుడు) అధ్యక్షతన ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేశారు. దీంతో రెండు మండలాల్లోని శివారు ప్రాంత భూములకు రెండు పంటలకూ సాగు నీరందడంతో రైతుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. భారీగా నిధులిచ్చి, ఎత్తిపోతల పథకం నిర్మించిన వైఎస్సార్‌ను ఎప్పటికీ మరువలేమని రైతులు అంటున్నారు. గౌర్రిపూడి, వేమవరం గ్రామాల్లోని మెరక భూముల్లో కాయగూరలు, పండ్ల తోటల పెంపకానికి కూడా ఈ ఎత్తిపోతల పథకం ప్రయోజనకరంగా ఉంటోందని ఆయా గ్రామాల రైతులు చెబుతున్నారు.

ఎత్తిపోతల పథకం వైఎస్సార్ వరం



దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి రైతులకిచ్చిన వరం గౌర్రిపూడి ఎత్తిపోతల పథకం. ఈ ఎత్తిపోతల పథకం రాకముందు శివారు ప్రాంత రైతులు సాగునీటి కోసం నానా అవస్థలు పడేవారు. దాళ్వా పంటపై ఆశలు ఉండేవి కావు. ఎత్తిపోతల పథకం వచ్చాక కరప, తాళ్లరేవు మండలాల్లోని ఆరు గ్రామాలకు సంబంధించి 4,800 ఎకరాలకు రెండు పంటలు పండించడానికి సాగు నీరందుతోంది.

– పబ్బినీడి పాపారావు, మాజీ అధ్యక్షుడు, శ్రీరాజశేఖర పరస్పర సహకార ఎత్తిపోతల పథకం, గురజనాపల్లి, కరప మండలం

శాకంబరిగా ఉప్పాలమ్మ తల్లి



కరప: గ్రామ దేవత ఉప్పాలమ్మ తల్లి సోమవారం భక్తులకు శాకంబరిగా దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం సందర్భంగా వైస్ ఎంపీపీ పాట్నీడి సత్యభీమేశ్వరరావు సమకూర్చిన వివిధ రకాల కాయగూరలు, పండ్లతో అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. అర్చకుడు విలపర్తి సత్యప్రసాద్ ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు, మహిళలు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. ఈ నెల 10న పౌర్ణమి రోజున అమ్మవారికి కుంకుమార్చన చేసి, ఈ కాయగూరలతో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని ఆలయ కమిటీ చైర్మన్ చిన్నారి మురళీకృష్ణ తెలిపారు. మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని కొల్లగొడుతున్న కూటమి ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి



కాకినాడ రూరల్: రాష్ట్రంలో ఖనిజ సంపదను కొల్లగొడుతున్న మట్టి మాఫియాకు, ప్రైవేట్ వ్యక్తులకు రాష్ట్ర ఖజానాను ధారాదత్తం చేయడానికి కూటమి ప్రభుత్వం నిరంకుశత్వంగా వ్యవహరిస్తోందని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి తీవ్రంగా విమర్శించారు. కూటమి పాలకుల అవినీతిని ఎండగడుతూ సోమవారం ఆమె విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రోజురోజుకూ అవినీతిమయంలో కూరుకుపోతోందన్నారు. విజయవాడ రూరల్‌కు సంబంధించి కొత్తూరులో ఉన్న 150 ఎకరాల విస్తీర్ణంలోని చెరువులో మట్టిని ఓ ప్రైవేటు వ్యక్తి తన పొలంలో మెరక చేసుకునేందుకు అనుమతులు ఇచ్చారని, ఈ కథనం కూటమి ప్రభుత్వానికి మానస పుత్రికగా ఉన్న ఏబీఎన్-ఆంధ్రజ్యోతిలో ప్రచురించారని చెప్పారు. స్థానిక గ్రామస్తులు ఎన్నో పర్యాయాలు ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో, తప్పని పరిస్థితిలో ఆ పత్రిక ప్రచురించిందన్నారు. ఆ వ్యక్తికి కేవలం ఐదు వేల క్యూబిక్ మీటర్లకు అనుమతిస్తే, లక్ష క్యూబిక్ మీటర్లు తవ్వారంటే ఎంత అక్రమానికి పాల్పడ్డారో అవగతమవుతోందన్నారు. ఏపీఎండీసీకి కూటమి ప్రభుత్వం ఖజానా తాళాలు ఇచ్చేసి.. వారికి ఎంత కావల్సి వస్తే, అంత రుణాలు తెచ్చుకోండనడం ఎంతవరకు సమంజసమని మండిపడ్డారు. ప్రజల నుంచి ఎన్ని ఫిర్యాదులు చేసినా, అక్కడున్న ఏడీ, డీడీ కానీ మాట్లాడకపోవడం దారుణమన్నారు. వారంతా అవినీతిలో కూరుకుపోయి, రాష్ట్రాన్ని కొల్లగొట్టి, ఎందుకూ పనికి రాకుండా చేస్తున్నారని విమర్శించారు. రాబోయే రోజుల్లో ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని క్షమించరన్నారు. ఇదంతా ప్రజలు గమనిస్తున్నారని, సరైన సమయంలో బుద్ధి చెబుతారన్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు

బోట్‌క్లబ్: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను కాకినాడలో ఘనంగా నిర్వహించారు. సోమవారం స్థానిక నరసన్ననగర్‌లో పాండురంగ స్వామి దేవాలయం పక్కనున్న కమ్యూనిటీ హాలులో పేదలకు ఉచిత వైద్య శిబిరం, మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. బాబూ జగ్జీవన్‌రామ్ యూత్ ఆధ్వర్యంలో దివంగత ఎమ్మార్పీఎస్ నేత కొండేపూడి శ్యాంబాబు స్ఫూర్తితో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని కాకినాడ ఆర్డీవో ఎస్ మల్లిబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లిబాబు మాట్లాడుతూ, నమ్మిన సిద్ధాంతం కోసం కొండేపూడి శ్యాంబాబు అవిశ్రాంత పోరాటం చేశారని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ పతాకం ఆవిష్కరించారు. రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ డాక్టర్ పి.దుర్గరాజు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. పలువురు వైద్యులు ఈ శిబిరంలో రోగులను పరీక్షించి, మందులను అందించారు.


రోగులకు ఉచితంగా మందులు అందిస్తున్న కాకినాడ ఆర్డీవో మల్లిబాబు


వలసపాకలలో జెండా ఆవిష్కరించి, జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పలు గ్రామాల్లో..

కరప: మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ జన్మదినం సందర్భంగా కాకినాడ రూరల్ ఎస్సీసెల్ అధ్యక్షుడు చాట్ర ఇమ్మానుయేల్ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని జరిపారు.

వలసపాకల, కరప, గొడ్డటిపాలెం తదితర గ్రామాల్లో మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు నివాళులర్పించి, ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. కాకినాడ రూరల్ ఇన్‌చార్జి తాతపూడి అప్పారావు, సవరపు పెదపాపారావు, రాయి చిన్న, కటకం వీర్రాజు, ఆర్.సుధీర్, ఆర్.ప్రసన్న, జి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు మద్దతుగా మోటార్ బైక్ ర్యాలీ


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కేంద్ర కార్మిక సంఘాల నాయకులు

కాకినాడ సిటీ: కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించే సార్వత్రిక సమ్మెకు మద్దతుగా నగరంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ జాతీయ ఉపాధ్యక్షురాలు జి.బేబీరాణి సోమవారం జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. కేంద్ర కార్మిక సంఘాల నాయకులు బేబీరాణి, జె.వెంకటేశ్వర్లు, తోకల ప్రసాద్, తాళ్లూరి రాజు, గొడుగు సత్యనారాయణ తదితరులు మాట్లాడారు. జిల్లాలోని పరిశ్రమలన్నింటిలో 75 శాతం ఉపాధిని స్థానికులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పని గంటలను పెంచుతూ చేసిన తీర్మానాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్త పోరాటాలకు కార్మికవర్గం సిద్ధపడాలని పిలుపునిచ్చారు. పది శాతంగా ఉన్న పెట్టుబడిదారుల వద్ద దేశం మొత్తం సంపదలో 57 శాతం కేంద్రీకృతమై ఉందన్నారు. మిగిలిన 43 శాతం సంపద మాత్రమే 90 శాతం ప్రజలదని, ప్రపంచంలో 50వ పేద దేశంగా భారత్ నిలిచేందుకు బీజేపీ మతోన్మాద, కార్పొరేట్ అనుకూల విధానాలే కారణమని ఆరోపించారు. పేద, ధనిక అంతరాల్లో భారత్ ప్రపంచంలోనే నంబర్ వన్ స్థానంలో ఉండగా, ప్రపంచ ఐదో ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని చెప్పుకోవడానికి ప్రధాని మోదీ ఏ మాత్రం సిగ్గు పడటం లేదని విమర్శించారు. కార్పొరేట్ శక్తుల ప్రయోజనాలకే 4 లేబర్ కోడ్‌లను మోదీ ప్రభుత్వం తెచ్చిందన్నారు. ఇవి అమల్లోకి వస్తే కార్మిక వర్గం 200 ఏళ్ల వెనుకటి పరిస్థితులకు నెట్టబడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా విధానాలకు వ్యతిరేకంగా దేశంలోని 45 కోట్ల మంది కార్మిక వర్గం సమ్మె చేయడానికి సిద్ధపడిందన్నారు. కాకినాడ జిల్లాలో కార్మికులు, ఉద్యోగులు, మేధావులు ప్రజాస్వామిక వాదులందరూ సమ్మె పోరాటాల్లో పాల్గొని, మోదీ-కార్పొరేట్ అనుకూల, మతోన్మాద విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు చెక్కల రాజ్‌కుమార్, మలకా రమణ, చంద్రమళ్ల పద్మ, మేడిశెట్టి వెంకటరమణ, పద్మావతి, భారతీప్రియ, జ్యోతి, అప్పలస్వామి, వర్మ, రామకృష్ణ, కుమారస్వామి, చిట్టిబాబు, అనపర్తి ఏడుకొండలు, శ్రీకాంత్, నరసరాజు, బి.రవి, కమలాకర్, కరీముల్లా, రమణ తదితరులు పాల్గొన్నారు.

మెగా పీటీఎం పక్కాగా నిర్వహించాలి

కాకినాడ సిటీ: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, సాంకేతిక విద్యా సంస్థల్లో ఈ నెల 10న మెగా పేరెంట్ - టీచర్ మీటింగ్ (పీటీఎం) 2.0 కార్యక్రమాలను విద్యా ఉత్సవంలా పక్కాగా నిర్వహించాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారులు, మండల, విద్యా శాఖ అధికారులను కలెక్టర్ షణ్మోహన్ సగిలి ఆదేశించారు. ఈ అంశంపై కలెక్టరేట్ నుంచి సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. మెగా పీటీఎం పర్యవేక్షణకు కలెక్టరేట్‌లో కంట్రోల్ రూము ఏర్పాటు చేసి, ఎప్పటికప్పుడు ఏర్పాట్ల ప్రగతిని సమీక్షిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమానికి వచ్చే తల్లులకు ముగ్గులు పోటీలు, మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్ వంటి క్రీడలు, తండ్రులకు టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, అసిస్టెంట్ కలెక్టర్ మనీషా, డీఆర్‌ఓ జె.వెంకటరావు, డీఈఓ పి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

శిక్షణ కేంద్రానికి కుట్టుమెషీన్ అందజేత

కాకినాడ రూరల్: మహిళల స్వయం ఉపాధికి కుట్టు శిక్షణ దోహద పడుతుందని మహిళా పాలిటెక్నిక్ కళాశాల విశ్రాంత ఉద్యోగిని ఉంగరాల సుభాకర్ అన్నారు. స్థానిక రమణయ్యపేటలో కుట్టు శిక్షణ కేంద్రానికి సోమవారం ఆయన కుట్టు మెషీన్‌ను అందజేశారు. ఆయన మాట్లాడుతూ మహిళలు తమ ఇంటి వద్దే ఉండి, స్వయం ఉపాధి పొందేందుకు కుట్టు శిక్షణ ఉపయోగపడుతుందని చెప్పారు.

నడిరోడ్డుపై గండం..!

- ప్రాణాపాయంగా మారిన పశువులు
- రాత్రి పూట యథేచ్ఛగా రోడ్లపైనే తిష్ట
- పోలీసుల హెచ్చరికలను పట్టించుకోని యజమానులు
- ఇటీవల గేదెను బైక్ ఢీకొని యువకుడి మృతి


కాకినాడలో రోడ్లపై సంచరిస్తున్న ఆవులు

కాకినాడ రూరల్: బతుకు తెరువు కోసం వివిధ ప్రాంతాల నుంచి కాకినాడ వచ్చే వారితో పాటు, నగరవాసులు, పరిసర ప్రాంతాల ప్రజలు తమ పనులు ముగించుకుని రాత్రిపూట ఆలస్యంగా ఇళ్లకు పయనమవుతారు. వారికి కాకినాడ నగరంలో రోడ్లపై పశువులు ప్రాణసంకటంగా మారుతున్నాయి. అడ్డదిడ్డంగా తిరుగుతూ ప్రజల ప్రాణాలను హరిస్తున్నాయి. రోడ్ల మధ్యలో నింద్రించే పశువులను దూరం నుంచి గమనించేలోపే ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడి, క్షతగాత్రులుగా మారుతున్నారు. కాకినాడ నగరంలో గుడారిగుంట ఎస్‌బీఐ బ్రాంచ్ సమీపంలో ప్రధాన రహదారిపై ఇటీవల జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెండడం చర్చనీయాంశంగా మారింది. పనులు ముగించుకుని ఇంటికి బయలుదేరిన అతడు రోడ్డుపై అడ్డంగా ఉన్న గేదెను నేరుగా బైక్‌తో ఢీకొని, తీవ్రంగా గాయపడి చనిపోయాడు. చాలా మంది గాయాల పాలై ఆస్పత్రిలో చేరుతున్నా.. రోడ్లపై సంచరించే పశువులను మాత్రం ఎవరూ కట్టడి చేయలేకపోతున్నారు.

కాకినాడ నగరంతో పాటు, సమీపంలోని ఇంద్రపాలెం, వలసపాకల, వాకలపూడి, రమణయ్యపేట, తూరంగి తదితర గ్రామాలలో పశువులు రోడ్లుపై ఎక్కువగా సంచరిస్తున్నాయి. పగటి పూట ఖాళీ ప్రదేశాలలో దర్శనమిచ్చే పశువులు చీకటి పడితే రోడ్లపై చేరుకుంటున్నాయి, రోడ్లపై అడ్డదిడ్డంగా తిరుగుతూ అక్కడే పడుకుంటున్నాయి. కొన్నిచోట్ల గుంపులుగా రోడ్లపై ఉండడంతో, వాటిని తప్పించుకుని వెళ్లేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కాకినాడ నగరం, పరిసర రూరల్ గ్రామాల్లో రాత్రిపూట ద్విచక్ర వాహనదారులు వేగంగా తమ బైక్‌లపై వెళుతూ, పశువులను గమనించడం లేదు.

పట్టించుకోని యజమానులు

యజమానులు పశువులను పాడినిచ్చే సంపదగానే కొలుస్తున్నారు, రోడ్లపై విడిచిపెట్టడం వలన వాటికి ప్రాణాపాయం ఉందని గమనించడం లేదు, ఇటీవల డెయిరీ ఫారమ్ సెంటరు వద్ద వాహనాలు ఢీకొన్న ఘటనలో రెండు ఆవులు కూడా చనిపోయాయి. పశువులతో పాటు, ప్రజలకూ ప్రాణహాని జరగకుండా ఉండాలంటే వాటిని రోడ్లపై విడిచిపెట్టరాదని పలువురు చెబుతున్నారు. తద్వారా వాహనదారులు ప్రాణాలు కాపాడిన వారవుతారంటున్నారు. అలాగే పశువులకు కూడా రక్షణ కల్పించినట్టు అవుతుందని చెబుతున్నారు. పశువుల యజమానులకు అవగాహన కల్పించడం ద్వారానే రోడ్లపై పశు సంచారాన్ని నియంత్రించడం సాధ్యమవుతుందని నగరవాసులు చెబుతున్నారు. ఇంద్రపాలెం పోలీసులు ఇటీవల రోడ్లపై సంచరించే పశువుల యజమానులను గుర్తించే ప్రక్రియ ప్రారంభించారు. అదేవిధంగా అన్ని స్టేషన్ల పరిధిలో చేపట్టి, వాటి సంచారాన్ని నిర్మూలించగలిగితే ప్రమాదాలకు చెక్ పెట్టినట్టు అవుతుంది.


కాకినాడ-రామేశ్వరం ప్రధాన రహదారిపై ఇంద్రపాలెం వద్ద రాత్రి పూట పశువుల తిష్ట

రోడ్లపై ప్రమాద భరితంగా..



కాకినాడ నగరంలో రోడ్లపై పశువులు ప్రమాద భరితంగా సంచరిస్తున్నాయి. చీకటిపడితే వీధుల్లో గుంపులుగా తిరుగుతున్న ఆవులు, గేదెలతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల కాకినాడ జయేంద్రనగర్ వద్ద జరిగిన ప్రమాదం బాధాకరం, పశువులతో పాటు, కేబుల్ వైర్లు వేలాడుతూ ప్రమాదంగా ఉన్నాయి. పశువులను నిర్మూలించడంతో పాటు, వేలాడుతున్న తీగలను తొలగించాలి.

– ఏబీజే వినుు, రమణయ్యపేట వైద్యనగర్, కాకినాడ

మైక్ ద్వారా హెచ్చరికల ప్రచారం



వాహన ప్రమాదాలు జరుగుతున్నందున పశువులను రోడ్లపైకి విడిచిపెట్టవద్దని ఆటో ద్వారా తమ పరిధిలోని ప్రాంతాలలో ప్రచారం చేస్తున్నాం. పశువుల యజమానులను హెచ్చరిస్తున్నాం. ప్రమాదాలు జరిగితే అందుకు కారణమైన పశువుల జయమానులుపై కేసులు నమోదు చేస్తాం. రాత్రి పూట ప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉన్నందున, వాహనదారులు తక్కువ వేగంతో ప్రయాణించాలి. ఇటీవల కాకినాడలో ద్విచక్రదారుడు పశువుని ఢీకొని చనిపోయాడు. మరో వాహనదారుడును ఎవరు ఢీకొన్నారో తెలియని పరిస్థితి ఉంది. రోడ్లపైకి పశువులను విడిచిపెట్టే వారిపై చర్యలు తప్పవు.

– బొక్కా పెద్దిరాజు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, సర్పవరం స్టేషన్

రోటరీ సేవలు విస్తృతం చేయాలి


నూతన సభ్యులను అభినందిస్తున్న మాజీ గవర్నర్, అసిస్టెంట్ గవర్నర్

బోట్‌క్లబ్: సమాజంలో నిరుపేదలకు రోటరీ సేవలు అందజేయాలని రోటరీ మాజీ గవర్నర్ ఎం వీరభద్రారెడ్డి అన్నారు. స్థానిక హోటల్‌లో సోమవారం రోటరీ క్లబ్ ఆఫ్ కాకినాడ సన్‌రైజ్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రోటరీ చేస్తున్న అనేక సేవలు ప్రజలకు పూర్తిగా చేరడం లేదన్నారు. రోటరీ చేస్తున్న వివిధ సేవలను మాధ్యమాల ద్వారా సభ్యులు ప్రచారం చేయాలన్నారు. క్లబ్ చేసే కార్యక్రమాలకు తనవంతు సహకారం అందిస్తానన్నారు. రోటరీ అసిస్టెంట్ గవర్నర్ కృష్ణకుమారి మాట్లాడుతూ, క్లబ్ ప్రారంభించి మూడేళ్లలో అనేక కార్యక్రమాలు చేసి, అందరి మన్ననలు పొందిందన్నారు. బెస్ట్ అధ్యక్షులు, బెస్ట్ క్లబ్ సహా 15 అవార్డులు క్లబ్‌కు రావడం దీని సేవలకు నిదర్శనమన్నారు. క్లబ్ అధ్యక్షులుగా ఏ.శామ్యూల్, సెక్రటరీగా ఎం.విజయలక్ష్మీతో అసిస్టెంట్ గవర్నర్ కృష్ణకుమారి ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా శామ్యూల్ మాట్లాడుతూ, క్లబ్ సభ్యుల సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు.